సాక్షి సూర్యాపేట

మంగళవారం : 28 : జనవరి : 2025



ఎంజీయూలో విద్యార్థుల ధర్నా
వీసీ తప్పుడు నిర్ణయాలతో తమ జీవితాలు ఆగమవుతున్నాయని విద్యార్థులు ఎంజీయూలో ధర్నా చేశారు. - 8లో



సాగర్‌లో బౌద్ధులు
నాగార్జునసాగర్‌ను నాగపూర్‌కు చెందిన బౌద్ధులు సందర్శించారు. బుద్ధవనంలో శిల్పాలను పరిశీలించారు. - 8లో



పరిశోధనలే ప్రగతికి కొలమానం
పరిశోధనలే యూనివర్సిటీల ప్రగతికి కొలమానం అని ఎంజీయూ వైస్ చాన్స్‌లర్ అన్నారు. - 8లో

మాకేదీ రుణమాఫీ!

రూ.2లక్షలకు పైగా రుణం తీసుకున్న 30వేల మంది రైతుల నిరీక్షణ

- వీరి కోసం ఎలాంటి మార్గదర్శకాలూ విడుదల చేయని ప్రభుత్వం
- మాఫీ అవుతుందో లేదోనని సందేహం
- ఆందోళనలో రైతాంగం



భానుపురి (సూర్యాపేట): రూ.2లక్షలకు పైబడి పంట రుణాలు తీసుకున్న రైతులు మాఫీ కోసం ఎదురు చూస్తున్నారు. ఏడాది క్రితం జరిగిన అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ రూ.2లక్షల వరకు ఉన్న పంట రుణాలను మాఫీ చేస్తామని ప్రకటించింది. ఈమేరకు నాలుగు విడతల్లో రూ.2లక్షల లోపు రుణాలను మాఫీ చేసింది. అయితే వివిధ కారణాలతో పూర్తిస్థాయిలో రైతులకు లబ్ధి చేకూరలేదు. అంతేకాకుండా రూ.2లక్షలకు పైబడి ఉన్న రుణాలపై ప్రభుత్వం ఏడాదిగా ఎలాంటి మార్గదర్శకాలు విడుదల చేయకపోవడంపై జిల్లా రైతాంగం ఆందోళన చెందుతోంది.

నాలుగు విడతల్లో 95,350 మంది రైతులకు మాఫీ

జిల్లాలో మొత్తం 1.40 లక్షల మంది రైతులు రుణాలు తీసుకున్నట్లు అధికారులు అంచనా వేశారు. ఇందులో ప్రభుత్వ హామీ మేరకు ఇప్పటివరకు నాలుగు విడతల్లో 95,350 మంది రైతులకు రుణాలు మాఫీ చేశారు. ఈ మాఫీ చేసిన సొమ్ము దాదాపు రూ.746.09 కోట్లు. మరో 14,599 మంది రైతులకు వివిధ కారణాలతో మాఫీ కాలేదు. మొత్తంగా రూ.2లక్షల లోపు రుణాలు ఉన్న రైతుల సంఖ్య 1,09,949 ఉన్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. రూ.2లక్షల లోపు చాలామంది రైతులకు రుణాలు ఉన్నప్పటికీ కుటుంబ ఆధారంగా ప్రభుత్వం లెక్కలు తీయడంతో కుటుంబ సభ్యుల అప్పు రూ.2లక్షలకు పైబడి ఉంది. వీరంతా దాదాపు 30వేల మంది ఉండే అవకాశమున్నట్లు తెలుస్తోంది.

జిల్లాలో రుణాలు పొందిన రైతులు : 1.40 లక్షలు (అంచనా)
మొదటి విడత మాఫీ అయిన రైతుల సంఖ్య : 56,217
రెండో విడత మాఫీ అయిన రైతులు : 26,376 మంది
మూడో విడత మాఫీ అయిన రైతులు : 12,757 మంది
నాలుగో విడత మాఫీ అయిన రైతులు : 15,009 మంది
రూ.2లక్షల లోపు మిగిలిన రైతులు : 14,599 మంది
రూ.2లక్షలకు పైబడి రుణాలు ఉన్న రైతులు : 30,000 మంది

ఇప్పట్లో లేనట్లేనా..

ఆగస్టు నుంచి రుణమాఫీ ప్రక్రియ నాలుగు విడతలుగా కొనసాగింది. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు పలు వేదికలపై రూ.2లక్షలకు పైబడి రుణాలు ఉన్నవారంతా వడ్డీ చెల్లిస్తే మాఫీ అవుతుందని, అదికూడా ప్రభుత్వం చెల్లించాలని ప్రకటించిన తర్వాతే అకౌంట్లలో డబ్బులు జమచేయాలని ప్రకటించారు. ఈ సమయంలో ఎక్కడా రూ.2లక్షలకు పైబడి రుణాలపై ప్రభుత్వం స్పష్టమైన మార్గదర్శకాలు కానీ.. ప్రభుత్వ విధానాన్ని సైతం వెల్లడించలేదు. నాలుగు విడతల మాఫీ సమయంలో అస్తవ్యస్తంగా ప్రక్రియ సాగడం, ప్రభుత్వ తీరుతో రైతులు తీవ్ర నిరాశకు గురవుతున్నారు. ఎన్నికల హామీల్లో భాగంగా ఈ నెల 26న మరో నాలుగు పథకాలను అమలు చేసిన నేపథ్యంలో రుణమాఫీపై ఎలాంటి ముందడుగు లేకపోవడంతో ఇప్పట్లో మాఫీ చేయనట్లేనన్న అనుమానాలను రైతులు వ్యక్తం చేస్తున్నారు.



బీఆర్‌ఎస్ రైతు మహా ధర్నాకు నల్లగొండ క్లాక్‌టవర్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు

నేడు బీఆర్‌ఎస్ రైతు మహా ధర్నా

- హాజరు కానున్న కేటీఆర్
- నల్లగొండ పట్టణంలో భారీ ఏర్పాట్లు
- పాల్గొననున్న బీఆర్‌ఎస్ పార్టీ నేతలు, రైతులు
- ఇప్పటికే రెండుసార్లు వాయిదా పడిన ధర్నా
- ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు మాత్రమే ర్యాలీ, ధర్నా నిర్వహించేందుకు పోలీసుల అనుమతి

సాక్షి ప్రతినిధి, నల్లగొండ: బీఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం నల్లగొండలో రైతు మహా ధర్నా జరగనుంది. ఈ ధర్నాకు బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.తారకరామారావు ముఖ్యఅతిథిగా హాజరు కానున్నారు. మాజీ మంత్రి గుంటకండ్ల జగదీశ్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, బీఆర్‌ఎస్ నాయకులు, రైతులు ఈ ధర్నాలో పాల్గొంటారు. నల్లగొండ పట్టణంలోని గడియారం సెంటర్‌లో మహాధర్నా నిర్వహించేందుకు పోలీసులు మూడు గంటలు మాత్రమే అనుమతించారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ధర్నా నిర్వహించాలి. రైతు మహాధర్నాను బీఆర్‌ఎస్ పార్టీ ఈనెల 12న నిర్వహించాల్సి ఉండగా.. సంక్రాంతి పండుగ నేపథ్యంలో వాయిదా వేసుకుంది. తిరిగి ఈ నెల 21న నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాక ధర్నాకు ఒక రోజు ముందు పోలీసులు అనుమతి నిరాకరించారు. సంక్రాంతి పండుగకు ఆంధ్రా ప్రాంతానికి వెళ్లిన వారు తిరిగి వస్తున్న క్రమంలో జాతీయ రహదారి అంతా రద్దీగా ఉంటుందని, పైగా క్లాక్ టవర్ సెంటర్ ఇరుకుగా ఉండటంతోపాటు, వాణిజ్య సముదాయాలు ఉన్నాయని, ట్రాఫిక్ సమస్య తలెత్తుతుందని, 21వ తేదీ నుంచి 24వ తేదీ వరకు గ్రామ సభలు ఉన్నందున బందోబస్తు కల్పించలేమని పోలీసులు అనుమతి నిరాకరించారు. దీంతో బీఆర్‌ఎస్ నేతలు అదేరోజు హైకోర్టును ఆశ్రయించారు. అయితే, హైకోర్టు ఈ నెల 27వ తేదీన ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ధర్నా నిర్వహించేందుకు అనుమతి ఇచ్చింది. కాగా, 27వ తేదీన కాకుండా 28వ తేదీన ధర్నా నిర్వహణకు పోలీసుల అనుమతికి బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు బోనగిరి దేవేందర్ దరఖాస్తు చేశారు. దీంతో పోలీసులు.. 1500 మందితో పట్టణంలో ఎన్టీఆర్ విగ్రహం నుంచి క్లాక్ టవర్ వరకు ర్యాలీ నిర్వహించి, ఆ తర్వాత ధర్నా నిర్వహించుకునేందుకు అనుమతి ఇచ్చారు.

ర్యాలీ, ధర్నాకు భారీగా ఏర్పాట్లు

రైతు మహా ధర్నా కోసం బీఆర్‌ఎస్ పార్టీ నల్లగొండ పట్టణంలో భారీ ఏర్పాట్లు చేసింది. ప్రధాన రోడ్ల వెంట హోర్డింగ్‌లు, ఫ్లెక్సీలను ఏర్పాటు చేసింది. ధర్నా ఏర్పాట్లను బీఆర్‌ఎస్ పార్టీ నల్లగొండ జిల్లా అధ్యక్షుడు రవీంద్రకుమార్, మాజీ ఎమ్మెల్యేలు గాదరి కిషోర్‌కుమార్, కంచర్ల భూపాల్‌రెడ్డి సోమవారం పరిశీలించారు.

రైతుకు భరోసా ఇచ్చేందుకే మహా ధర్నా

రైతులు మొదటి నుంచీ బీఆర్‌ఎస్ వెంటే ఉన్నారు. వారిని ఆత్మహత్యల నుంచి బయటపడేసింది బీఆర్‌ఎస్ పార్టీనే. ప్రస్తుతం రైతాంగాన్ని కాంగ్రెస్ పార్టీ మోసం చేసింది. అందరికీ రుణ మాఫీ చేయలేదు. రూ.15 వేలు రైతు భరోసా ఇస్తామని తగ్గిస్తున్నారు. సన్న ధాన్యానికి బోనస్ ఇస్తామని మోసం చేసింది. కాంగ్రెస్ ప్రభుత్వంపై రైతులు తిరుగుబాటు చేస్తున్నారు. గ్రామసభల్లో నిలదీశారు. ఇలాంటి పరిస్థితుల్లో బీఆర్‌ఎస్ పార్టీ రైతులకు, ప్రజలకు అండగా ఉంటుంది. అందులో భాగంగానే రైతులకు భరోసా ఇచ్చేందుకు మహా ధర్నా చేపట్టబోతున్నాం. నల్లగొండ నుంచి రైతుల తరఫున పోరాటం చేసేందుకు కేటీఆర్ వస్తున్నారు. బీఆర్‌ఎస్ ధర్నా అంటేనే జిల్లా మంత్రి, కాంగ్రెస్ నాయకులు భయపడిపోతున్నారు.

– గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి
మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే

న్యూస్‌రీల్

మతిస్థిమితం లేని విద్యార్థులకు చేయూతనందించాలి

- జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి శ్రీవాణి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి శ్రీవాణి

చివ్వెంల(సూర్యాపేట) : మతిస్థిమితంలేని విద్యార్థులకు ప్రతి ఒక్కరూ చేయూతనందించాలని సూర్యాపేట జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి పి.శ్రీవాణి కోరారు. సోమవారం సూర్యాపేట మండలం కాసరబాద గ్రామంలోని బధిరుల పాఠశాలను సందర్శించి మాట్లాడారు. మతిస్థిమితం లేని పిల్లల హక్కుల పరిరక్షణ, వారికి రావాల్సిన ఆస్తుల విషయంలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ సహకారం ఉంటుందన్నారు. విద్యార్థులు ఆరోగ్యం విషయంలో శ్రద్ధవహించేలా చూడాలని హెచ్ఎం మదనాచారిని ఆదేశించారు. పారా లీగల్ వలంటీర్స్.. సమయం ఉన్నప్పుడల్లా పాఠశాలను సందర్శించాలని సూచించారు. ఏవైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో సూర్యాపేట బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి డపుకు మల్లయ్య, డిఫెన్స్ కౌన్సిల్స్ వసంత సత్యనారాయణ పిళ్లే యాదవ్, బొల్లెద్దు వెంకటరత్నం, బట్టిపల్లి ప్రవీణ్ కుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు సీపీఎస్ ఉద్యోగుల నిరసన

సూర్యాపేటటౌన్ : కేంద్రం తీసుకొచ్చిన యూనిఫైడ్ పెన్షన్ స్కీం గెజిట్‌పై కాంట్రిబ్యూటరీ పెన్షన్‌స్కీం(సీపీఎస్) ఉద్యోగులు మంగళవారం నిరసన కార్యక్రమాలు నిర్వహించాలని సీపీఎస్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు లక్కపాక ప్రవీణ్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో కోరారు. జిల్లా వ్యాప్తంగా వివిధశాఖల్లో పనిచేస్తున్న సీపీఎస్ ఉద్యోగులంతా లంచ్ అవర్ లో గెజిట్ ప్రతులను దహనం చేయాలని పిలుపునిచ్చారు. దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలలో ఈ కార్యక్రమం ఉందని తెలిపారు.

మహాసభలకు సిద్ధం కావాలి



సమావేశంలో మాట్లాడుతున్న గన్నా చంద్రశేఖర్

భానుపురి (సూర్యాపేట) : వచ్చే నెలలో జిల్లాలో నిర్వహించే సీపీఐ మండల, గ్రామ మహాసభలకు సిద్ధం కావాలని పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గన్నా చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. సోమవారం సూర్యాపేట పట్టణంలోని ఆ పార్టీ కార్యాలయంలో ఎల్లావుల రాములు అధ్యక్షతన నిర్వహించిన జిల్లా కౌన్సిల్ కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. వందేళ్ల పోరాటాలు, త్యాగాల చరిత్ర కలిగిన పార్టీ సీపీఐ అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు, కార్యవర్గ సభ్యులు నారాయణరెడ్డి, శ్రీనివాస్, యాదగిరి, కృష్ణారెడ్డి, మల్లేశ్వరి, బూర వెంకటేశ్వర్లు, గుండు వెంకటేశ్వర్లు, జిల్లా కౌన్సిల్ సభ్యులు తొట్ల ప్రభాకర్, లక్ష్మయ్య, రాము, కోటయ్య, రాజు, వెంకటయ్య పాల్గొన్నారు.

మతోన్మాదశక్తులకు నిలయంగా మార్చేందుకు కుట్ర



సమావేశంలో మాట్లాడుతున్న మహేష్

భానుపురి (సూర్యాపేట) : విశ్వవిద్యాలయాలను మతోన్మాద శక్తులకు నిలయంగా మార్చేందుకు బీజేపీ ప్రభుత్వం కుట్రలు చేస్తుందని పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు పి.మహేష్ ఆరోపించారు. సోమవారం సూర్యాపేట పట్టణంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మోదీ ప్రభుత్వం నూతన జాతీయ విద్యా విధానం తీసుకొచ్చి పేద విద్యార్థులకు ఉన్నత విద్యను దూరం చేస్తోందన్నారు. పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో మంగళవారం ఖమ్మంలో జరిగే విలీన సభను జయప్రదం చేయాలని కోరారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో విడివిడిగా పనిచేస్తున్న పీడీఎస్ యూ విలీన సభ ద్వారా ఐక్యం అవుతుందన్నారు. సమావేశంలో పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పోలేబోయిన కిరణ్, జిల్లా అధ్యక్షుడు పుల్లూరి సింహాద్రి, మహేష్, నవీన్, వినయ్, పవన్, శ్రీధర్, సాయి పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేయాలి



ప్రజావాణిలో ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్న కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

- కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

భానుపురి (సూర్యాపేట) : జిల్లాలో ఇంటర్మీడియట్ పరీక్షల కోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఆయన ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు.అనంతరం అధికారులతో మాట్లాడారు. ఫిబ్రవరి 3 నుంచి 22 వరకు ఇంటర్మీడియట్ ప్రాక్టికల్, మార్చి 5 నుంచి 25 వరకు ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రజావాణిలో 93 దరఖాస్తులు వచ్చాయని వీటిని అధికారులు వెంటనే పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ రాంబాబు, డీఆర్‌డీఓ అప్పారావు, సీపీఓ కిషన్, ఎల్డీఎం బాపూజీ, వ్యవసాయ అధికారి శ్రీధర్ రెడ్డి, డీటీడీఓ శంకర్, డీఈఓ అశోక్, ఎస్సీ అభివద్ధి అధికారి లత, బీసీ అభివృద్ధి అధికారి అనసూయ, మైనార్టీ వెల్ఫేర్ అధికారి జగదీష్ రెడ్డి, మార్కెటింగ్ డీఎం శర్మ పాల్గొన్నారు.

అధికారుల కృషి ప్రశంసనీయం


భానుపురి (సూర్యాపేట) : రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, నూతన రేషన్ కార్డుల జారీ ప్రక్రియను విజయవంతంగా అమలు చేయడంలో మండల, జిల్లా స్థాయి అధికారుల కృషి ప్రశంసనీయమని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ పేర్కొన్నారు. సోమవారం సూర్యాపేట కలెక్టరేట్‌లో అన్ని శాఖల అధికారులతో వెబెక్స్ ద్వారా నిర్వహించిన కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. లబ్ధిదారుల ఎంపిక కోసం క్షేత్రస్థాయి విచారణకు, గ్రామసభల నిర్వహణకు ప్రజల సహకారం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ పి. రాంబాబు, డీఆర్డీఓ అప్పారావు, డీఈఓ అశోక్, పశుసంవర్ధక శాఖ అధికారి శ్రీనివాస్, మైనార్టీ వెల్ఫేర్ అధికారి జగదీశ్ రెడ్డి, డీఎస్ఓ రాజేశ్వరరావు, సంక్షేమాధికారి నరసింహారావు, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శ్రీనివాస్ నాయక్, ఇండస్ట్రియల్ అధికారి సీతారాం నాయక్ పాల్గొన్నారు.

రెవెన్యూ శాఖలో పదోన్నతులు

భువనగిరిటౌన్ : రెవెన్యూలో పలువురు సీనియర్ అసిస్టెంట్లు, ఆర్ఐలకు పదోన్నతులు కల్పిస్తూ ఆ శాఖ చీఫ్ సెక్రటరీ నవీన్‌మిట్టల్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. అదనపు నాయబ్ తహసీల్దార్ ఉపేందర్‌రెడ్డి నాయబ్ తహసీల్దార్‌గా యాదాద్రి భువనగిరి జిల్లాకు బదిలీపై రానున్నారు. యాదాద్రి జిల్లాలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న సీహెచ్ యాదగిరి నాయబ్ తహసీల్దార్‌గా సూర్యాపేట జిల్లాకు బదిలీ అయ్యారు. సూర్యాపేటలో ఆర్ఐగా విధులు నిర్వహిస్తున్న జనగాం శైలజ యాదాద్రి జిల్లాకు వెళ్లనున్నారు. నల్లగొండలో ఆర్ఐగా పనిచేస్తున్న సిరాజొద్దీన్, డి.లింగస్వామి నాయబ్ తహసీల్దార్లుగా, సీనియర్ అసిస్టెంట్ పి.శివకుమార్ పదోన్నతిపై యాదాద్రి జిల్లాకు రానున్నారు.

మృతిచెందిన మహిళ ఉపాధి పనులకు వెళ్లిందట!

- చిలుకూరులో ఉపాధి హామీ పథకంలో అక్రమాలు
- 2018లోనే మహిళా కూలీ మృతి
- 2024–25లో కూడా పనులకు వెళ్లినట్లు మస్టర్లలో నమోదు
- కూలి డబ్బులు డ్రా చేసుకొని స్వాహా
- స్థానిక యువకులు, పార్టీల నేతలు ఆరా తీయడంతో వెలుగులోకి..


Signature/Thumb impression of Applicant
Seal & Signature of Registering Authority
Requested Period of Employment

2018లో మృతి చెందిన మహిళా కూలీ ఉపాధిహామీ పనులు చేసినట్లుగా వచ్చిన రిపోర్టు

చిలుకూరు : చిలుకూరు మండల కేంద్రంలో ఉపాధి హామీ పనుల్లో అక్రమాలు వెలుగుచూశాయి. ఓ మహిళ ఆరేళ్ల క్రితమే మృతి చెందినా ఇప్పటి వరకు ఉపాధి పనులకు వెళ్లినట్లు నమోదు చేసి కూలి డబ్బులు కాజేశారు. ఈ విషయం ఎలా బయట పడిందంటే.. అర్హత ఉండి కేవలం ఉపాధిహామీ పని దినాలు 20 రోజులు లేకపోవడంతో చాలా మంది భూమిలేని నిరుపేదలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం వర్తించలేదు. దీంతో గ్రామానికి చెందిన కొందరు యువకులు, పలు పార్టీల నాయకులు ఉపాధిహామీ పనుల వ్యవహారంపై వారం రోజులుగా పూర్తి స్థాయిలో నిఘా పెట్టారు. గ్రామంలో ఎవరు ఎన్ని పని దినాలు పూర్తి చేశారు? ఎప్పుడు చేశారు? అనే కోణంలో వివరాలు ఆరా తీశారు.

2024 మార్చిలో కూడా చెరువు మట్టి తోలకం పనులు చేసినట్లు..

చిలుకూరు మండల కేంద్రం పరిధిలోని రావి నారాయణరెడ్డి కాలనీకి చెందిన ఖాసీంబీ అనారోగ్యంతో 2018 సెప్టెంబర్ 10వతేదీన మృతి చెందింది. ఆ తరువాత ఆమె ఉపాధి పనులకు వచ్చినట్లు, డబ్బులు డ్రా చేసుకున్నట్లు వివరాలు రికార్డుల్లో ఉన్నాయి. మృతి చెందిన తరువాత కూడా ఉపాధి పనులకు వెళ్లినట్లు జాబ్‌కార్డు నంబర్ 10470తో మస్టర్‌లలో నమోదు చేశారు. ఆమె 2020–21లో ఆరు రోజులు, 2021–22లో ఆరు రోజులు, 2022–23లో ఆరు రోజులు, 2023–24లో 18 రోజులు, 2024–25లో ఇప్పటి వరకు వారం రోజులు పని చేసినట్లుగా రికార్డు చేశారు. 2024 మార్చిలో చిలుకూరులో చెరువు మట్టి తోలకం పనులు చేసినట్లుగా ఉంది. ఈ పనులకు సంబంధించిన కూలి డబ్బులు చిలుకూరు గ్రామీణ వికాస్ బ్యాంక్‌లో ఆమె ఖాతాలో పడ్డాయి. ఈ డబ్బులు ఎలా డ్రా చేశారు? ఎవరు డ్రా చేశారు? అనే అంశం గ్రామంలో చర్చనీయాంశంగా మారింది. ఉపాధిహామీ పనులపై పూర్తిస్థాయి విచారణ చేయాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

మహిళా సంఘాలకు కొత్త సారథులు

- ఎన్నికల నిర్వహణకు అధికారుల కసరత్తు
- ఇప్పటికే ఏపీఎం, సీసీలు, ఇతర సిబ్బందికి శిక్షణ
- మార్చిలో జిల్లా సమాఖ్య ఎన్నికలు పూర్తిచేసేలా ప్రణాళిక



మొత్తం గ్రామాలు	మండలాలు
579	23
మహిళా సంఘాలు 1,73,630	
సంఘాల్లో సభ్యులు 20,83,644 మంది	

చిలుకూరు: స్వయం సహాయక (మహిళా) సంఘాలకు కొత్త సారథులను ఎన్నుకోవడానికి అధికారులు కసరత్తు చేస్తున్నారు. సంఘం సభ్యుల నుంచి గ్రామ, మండల, జిల్లా సమాఖ్యలకు అధ్యక్ష, ఉపాధ్యక్షులను ఎన్నుకునే ప్రక్రియను జిల్లా గ్రామీణాభివృద్ధిశాఖ అధికారులు చేపట్టనున్నారు. ఎన్నికల నిర్వహణపై ఇప్పటికే మండల ఏపీఎం, సీసీలు, ఇతర సిబ్బందికి జిల్లా స్థాయిలో శిక్షణ ఇచ్చారు. వీరు గ్రామ స్థాయిలో కొత్త సారథుల ఎన్నికపై సంఘాల సభ్యులకు అవగాహన కల్పిస్తున్నారు. మార్చి నెలాఖరులోపు ప్రక్రియ పూర్తి చేసేలా కార్యాచరణ రూపొందిస్తున్నారు.

సంఘాల నిర్వహణలో అధ్యక్షులు, ఉపాధ్యక్షుల పాత్ర కీలకం

స్వయం సహాయక సంఘాలకు ప్రభుత్వం లోన్లు మంజూరు చేయడం, శ్రీనిధి లోన్లు ఇవ్వడంతో మహిళలు ఆర్థికంగా ఎంతో బలోపేతం అవుతున్నారు. మహిళలు ఒక వైపు కుటుంబ బాధ్యతలు నిర్వరిస్తూనే, మరో వైపు చిరు వ్యాపారాల్లో రాణిస్తూ ఆర్థికంగా అభివృద్ధి చెందుతున్నారు. ప్రతినెలా క్రమం తప్పకుండా పొదుపు డబ్బులతో పాటు శ్రీనిధి లోన్ల డబ్బులు కూడా బ్యాంక్‌లలో వీరు జమ చేస్తున్నారు. ఈ ప్రక్రియలో మహిళా సంఘాల అధ్యక్షులు, ఉపాధ్యక్షుల పాత్ర కీలకమైంది. జిల్లా వ్యాప్తంగా ఉన్న మహిళా గ్రామ సంఘాలు వేల కోట్ల రూపాయల లావాదేవీలు కొనసాగిస్తున్నాయి.

కొత్త వారికి అవకాశం..

స్వయం సహాయక సంఘాల్లో కనీసం 10 మంది నుంచి 15 మంది వరకు సభ్యులుంటారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న సంఘాల్లోని సభ్యుల్లో కొత్త వారికి అవకాశం కల్పించనున్నారు. నిబంధనల ప్రకారం ఆసక్తి ఉన్న మహిళలకు సమావేశం నిర్వహించి ఏకగ్రీవం, చేతులు పైకెత్తి ఎన్నుకోవడం, చీటీలు రాసి సభ్యురాలి ఎన్నికకు మద్దతు తెలియజేయడం లాంటిమూడు పద్ధతుల్లో ఏదైనా విధానం ద్వారా ఎన్నుకోవాల్సి ఉంటుంది. సంఘాల ద్వారా ఎన్నికైన అధ్యక్షులు గ్రామ సంఘం అధ్యక్షురాలి(గ్రామ సమాఖ్య అధ్యక్షురాలు)ని, గ్రామ సమాఖ్య అధ్యక్షుల నుంచి మండల సమాఖ్య అధ్యక్షురాలిని ఎన్నుకుంటారు. మండల అధ్యక్షురాళ్లు అందరూ కలిసి జిల్లా సమాఖ్యకు అధ్యక్షులను ఎన్నుకుంటారు. మండల స్థాయి ఎన్నికల ప్రక్రియను ఫిబ్రవరి నెలాఖారు వరకు పూర్తి చేసేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. మార్చినెలలో జిల్లా సమాఖ్య ఎన్నికలు పూర్తి చేయనున్నట్లుగా అధికారులు చెబుతున్నారు.

శివుడికి సంప్రదాయ పూజలు

యాదగిరిగుట్ట : యాదగిరి శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రానికి అనుబంధంగా ఉన్న శ్రీపర్వతవర్ధిని సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో సోమవారం సంప్రదాయ పూజలు నిర్వహించారు. శివుడికి ఇష్టమైన రోజు కావడంతో రుద్రాభిషేకం, బిల్వార్చన చేశారు. అనంతరం స్ఫటిక లింగానికి పూజలు నిర్వహించారు. ఆయా పూజల్లో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. ఇక ప్రధానాలయంలో రోజువారీ పూజా కార్యక్రమాలు కొనసాగాయి. వేకువజామున సుప్రభాత సేవ చేపట్టిన అనంతరం గర్భాలయంలోని స్వయంభూలకు నిజాభిషకం, అర్చన చేశారు. అనంతరం ప్రథమ ప్రాకార మండపం, ముఖమండపంలో సుదర్శన హోమం, గజవాహన సేవ, నిత్యకల్యాణం, జోడు సేవోత్సవం తదితర పూజలు నిర్వహించారు.



స్ఫటిక లింగానికి పూజలు చేస్తున్న పూజారులు

సమస్యల పరిష్కారానికి ముందుండి పోరాడుతా



ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి

- ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి

సూర్యాపేటటౌన్ : ఉపాధ్యాయులు, అధ్యాపకుల సమస్యల పరిష్కారానికి తాను ముందుండి పోరాడుతానని ఎమ్మెల్సీ నర్సిరెడ్డి అన్నారు. సోమవారం సూర్యాపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించి మాట్లాడారు. సీపీఎస్ పై కూడా అలుపెరుగని పోరాటం చేస్తానన్నారు. మెరుగైన పీఆర్సీ, పెండింగ్ బిల్లుల క్లియరెన్స్ కోసం కృషి చేస్తానన్నారు. కాంట్రాక్ట్ అధ్యాపకుల క్రమబద్ధీకరణలో తన వంతు పాత్ర పోషించిన సంగతి తెలిసిందేనన్నారు. మిగిలిన కాంట్రాక్టు లెక్చరర్ల హక్కుల సాధనకు పాటుపడతానన్నారు. తనకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి మరోసారి అవకాశం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ పెరుమాళ్ల యాదయ్య, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు

ప్రభుత్వ విద్యారంగ సమస్యలను పరిష్కరించాలి

సూర్యాపేటటౌన్ : రాష్ట్రంలోని ప్రభుత్వ విద్యా రంగంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఎమ్మె అలుగుబెల్లి నర్సిరెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం టీఎస్ యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో సూర్యాపేట డివిజన్ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. దీనికి సంఘం జిల్లా అధ్యక్షుడు ఎన్.సోమయ్య అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా నర్సిరెడ్డి మాట్లాడుతూ సంపాదిత సెలవుల బిల్లులు, జీపీఎఫ్ రుణాలు, మెడికల్ రీయింబర్స్‌మెంట్, పెన్షన్ బకాయిలను క్లియర్ చేయాలన్నారు. సమావేశంలో సంఘం రాష్ట్ర కార్యదర్శి సీహెచ్ రాములు, సిరికొండ అనిల్ కుమార్, జె.యాకయ్య, కె. అరుణ భారతి, జి.వెంకటయ్య, బి.ఆదం, వి.రమేష్, సీహెచ్ రమేష్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

లారీ డ్రైవర్ రిమాండ్

చౌటుప్పల్ రూరల్: బైక్‌ను ఢీకొట్టిన లారీ డ్రైవర్‌ను చౌటుప్పల్ పోలీసులు సోమవారం రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రామన్నపేట మండలం ఇంద్రపాలనగరం గ్రామానికి చెందిన భాను ప్రసాద్, చందు ఈ నెల 24వ తేదీన బైక్‌పై వెళ్తుండగా.. చౌటుప్పల్ మండలం ఎస్.లింగోటం గ్రామ పరిధిలోని ప్రతిష్ట పరిశ్రమ ఎదుట వారి బైక్‌ను లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో భానుప్రసాద్, చందు తీవ్రంగా గాయపడ్డారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. దర్యాప్తులో భాగంగా ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్ సంస్థాన్ నారాయణపురం మండలం కొత్తగూడెం గ్రామానికి చెందిన కొండూరు రవీందర్‌గా పోలీసులు గుర్తించి అరెస్ట్ చేశారు. మద్యం మత్తులో లారీ నడిపి ప్రమాదానికి కారణమైనట్లు పోలీసుల విచారణలో తేలడంతో రవీందర్‌పై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ మన్మథకుమార్ తెలిపారు.

మద్యం మత్తులో యువకుడి ఆత్మహత్య

కోదాడరూరల్: మద్యం మత్తులో ఉరేసుకుని యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన కోదాడ పట్టణంలోని చెరువు బజార్‌లో సోమవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చెరువు బజార్‌కు చెందిన చేవకాల భూపతిరాజు(24) రెండేళ్ల కిందట ప్రేమ వివాహం చేసుకున్నాడు. ఆ తర్వాత మద్యానికి బానిసై ఎటువంటి పనిచేయకుండా ఖాళీగా ఉంటున్నాడు. మద్యం మత్తులో ఉన్న భూపతిరాజు సోమవారం ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య గుణవతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు కోదాడ పోలీసులు తెలిపారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

బీబీనగర్ : మంతాళం వేసిన ఇంట్లో గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. ఈ ఘటన బీబీనగర్ మండల కేంద్రంలో సోమవారం జరిగింది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. బీబీనగర్ మండల కేంద్రంలోని ఇందిరమ్మ కాలనీకి చెందిన పొట్ట కుమార్ ఇంట్లో సోమవారం ఎవరూ లేని సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు చొరబడి నగదు, నగలు ఎత్తుకెళ్లారు.

వ్యభిచార గృహంపై పోలీసుల దాడి

కోదాడరూరల్: కోదాడ పట్టణంలోని ఉత్తమ్‌పద్మావతి కాలనీలో ఓ ఇంట్లో వ్యభిచారం నిర్వహిస్తున్నారనే విశ్వసనీయ సమాచారం మేరకు సోమవారం ఆ ఇంటిపై దాడి చేసి నిర్వాహకురాలితో పాటు ఇద్దరు విటులు, ఓ మహిళను అదుపులోకి తీసుకున్నట్లు సీఐ రాము తెలిపారు. వారిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించనున్నట్లు పేర్కొన్నారు.

లారీలు చోరీ చేస్తున్న నలుగురి అరెస్ట్

- పరారీలో మరో ఇద్దరు
- నిందితుల నుంచి రెండు కార్లు, రెండు లారీలు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డి



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ శివరాంరెడ్డి

తిప్పర్తి: పార్కింగ్ చేసిన లారీలను చోరీ చేస్తున్న నలుగురు వ్యక్తులను తిప్పర్తి పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసు వివరాలను సోమవారం తిప్పర్తి పోలీస్ స్టేషన్‌లో నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డి విలేకరులకు వెల్లడించారు. నల్లగొండ పట్టణంలోని రాంనగర్‌కు చెందిన పాలడుగు రాజు తన లారీని గత నెల 24న తిప్పర్తి మార్కెట్ యార్డులో పార్కింగ్ చేశాడు. ఆ లారీని గుర్తుతెలియని వ్యక్తులు దొంగిలించారు. దీంతో రాజు తిప్పర్తి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు ఎస్ఐ సాయిప్రశాంత్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. ఆదివారం సాయంత్రం తిప్పర్తి మండల కేంద్రంలోని నకిరేకల్ రోడ్డులో పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా.. కట్టంగూర్ మండలం ఆయిటిపాముల గ్రామానికి చెందిన లారీ డ్రైవర్లు మెండె వెంకన్న, గుజ్జెంటి శ్రీనివాస్, కొరుపుల సాయికుమార్, కేతేపల్లి మండలం ఇనుపాముల గ్రామానికి చెందిన కొండా సురేష్ నంబర్ ప్లేటు లేని రెండు కార్లలో వెళ్తుండగా ఆపారు. వారిని అదుపులో తీసుకొని విచారించగా.. తిప్పర్తిలో లారీ చోరీ చేసి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రానికి చెందిన అరికె రవి ద్వారా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఎన్టీఆర్ కృష్ణా జిల్లా విజయవాడలోని ఆటోనగర్‌లో హబీబ్ రెహ్మాన్‌కు అమ్మేసినట్లు నిజం ఒప్పుకున్నారు. అంతేకాకుండా ఈ నెల 5వ తేదీన చిట్యాల మండలం పెద్దకాపర్తి వద్ద పెట్రోల్ బంక్‌లో పార్కింగ్ చేసిన లారీని కూడా వీరు దొంగిలించి అమ్మేసినట్లు పోలీసుల విచారణలో తేలింది. అదేవిధంగా గుజ్జెంటి శ్రీనివాస్, మెండె వెంకన్న ఫైనాన్స్‌లో లారీని తీసుకొని ఈఎంఐలు కట్టకుండా ఫైనాన్స్ కంపెనీలను మోసం చేసినట్లు డీఎస్పీ తెలిపారు. వీరు కార్లలో తిరుగుతూ రాత్రి పూట పార్కింగ్ చేసి ఉన్న లారీలను గుర్తించి దొంగతనాలకు పాల్పడుతున్నారని డీఎస్పీ పేర్కొన్నారు. నిందితుల నుంచి రెండు కార్లు, రెండు లారీలను స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. కొండా సురేష్, హబీబ్ రెహ్మాన్ పరారీలో ఉన్నట్లు డీఎస్పీ పేర్కొన్నారు. ఈ కేసును ఛేదించిన శాలిగౌరారం సీఐ కొండల్‌రెడ్డి, ఎస్ఐ సాయిప్రశాంత్, పోలీస్ సిబ్బందిని డీఎస్పీ అభినందించి రివార్డు అందజేశారు. ఈ విలేకరుల సమావేశంలో సీఐ కొండల్‌రెడ్డి, ఎస్ఐ సాయిప్రశాంత్, పోలీస్ సిబ్బంది శ్రీనివాస్‌రెడ్డి, రాజీవ్, సురేష్, రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సాగర్‌ను సందర్శించిన నాగపూర్ బౌద్ధులు



నాగార్జున కొండపై గల మ్యూజియంలో బుద్ధుడి చెంత బౌద్ధులు

నాగార్జునసాగర్: నాగార్జునసాగర్‌ను నాగపూర్‌కు చెందిన బౌద్ధ మతస్తులు సోమవారం సందర్శించారు. లాంచీలో నాగార్జునకొండకు వెళ్లారు. అక్కడ ఐలాండ్ మ్యూజియం, చారిత్రక కట్టడాలు, మహాస్తూపం, సింహళ విహారం, చైత్యాలను సందర్శించారు. అనంతరం బుద్ధవనంలో బుద్ధుడి పాదాల చెంత పుష్పాంజలి ఘటించారు. అక్కడి నుంచి బుద్ధచరిత వనం, స్తూప వనం, ధ్యాన వనం, జాతక పార్కు తదితర ప్రాంతాలను సందర్శించారు. మహాస్తూపం అంతర్భాగంలోని ధ్యానమందిరంలో అష్టబుద్ధులను దర్శించుకుని ధ్యానం చేశారు. వీరికి స్థానిక గైడ్ సత్యనారాయణ నాగార్జునకొండ, బుద్ధ వనం విశేషాలను వివరించారు.



బుద్ధవనంలో నాగపూర్‌కు చెందిన బౌద్ధులు

దొంగ అరెస్ట్

భువనగిరిటౌన్: భువనగిరి బస్టాండ్‌లో దొంగను పోలీసులు పట్టుకుని రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జనగామ జిల్లా బచ్చన్నపేట మండలం కొన్నె గ్రామానికి చెందిన యాట రమేష్ భువనగిరి పట్టణంలోని అర్బన్‌కాలనీలో ఈ నెల 25న దొంగతం చేసేందుకు వచ్చాడు. అతడు అనుమానాస్పదంగా కనిపించడంతో స్థానికులు పట్టుకునే ప్రయత్నం చేయగా.. తప్పించుకుని పారిపోయాడు. అర్బన్‌కాలనీకి చెందిన సాయికుమార్ పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. సోమవారం భువనగిరి బస్టాండ్‌లో అనుమానాస్పదంగా తిరుగుతున్న రమేష్‌ను పట్టుకుని విచారించగా.. గతంలో పలు దొంగతనాలు చేసినట్లు ఒప్పుకోవడంతో రిమాండ్ చేసి హైదరాబాద్‌లోని చర్లపల్లి జైలుకు తరలించినట్లు పట్టణ పోలీసులు తెలిపారు.

చికిత్స పొందుతూ యువకుడు మృతి

హుజూర్‌నగర్ (చింతలపాలెం): తల్లిదండ్రుల మందలించారని మనస్తాపంతో గడ్డి మందు తాగిన యువకుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. ఎస్ఐ అంతిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. చింతలపాలెం మండలం వెల్లటూరు గ్రామానికి చెందిన గోసుల హనుమంతు కుమారుడు వెంకటేశ్వర్లు(18) ఖమ్మంలో ఇంటర్మీడియట్ సెకండియర్ చదువుతున్నాడు. సంక్రాంతి సెలవులకు ఇంటికి వచ్చిన అతడిని సరిగా చదవడం లేదని ఈ నెల 20వ తేదీన తల్లిదండ్రులు మందలించారు. దీంతో మనస్తాపానికి గురైన వెంకటేశ్వర్లు గడ్డి మందు తాగాడు. కుటుంబ సభ్యులు గమనించి చికిత్స నిమిత్తం ఖమ్మంకు తీసుకెళ్లారు. పరిస్థితి విషమించడంతో హైదరాబాద్‌లోని కిమ్స్ హాస్పిటల్‌కు తరలించగా.. చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. సోమవారం మృతుడి మేనత్త గాజుల సైదమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

నిచ్చెన పైనుంచి పడి..

చింతపల్లి: ప్రమాదవశాత్తు నిచ్చెన పైనుంచి జారిపడి తీవ్రంగా గాయపడిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. సోమవారం ఎస్ఐ యాదయ్య తెలిపిన వివరాల ప్రకారం.. చింతపల్లి మండలం కుర్మేడు గ్రామ శివారులోని ఇటుక బట్టీలో ఒరిస్సా రాష్ట్రానికి చెందిన తురు పాన్ చింద(35) కూలీ పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ నెల 25వ తేదీన ఇటుక బట్టీలో వరి పొట్టు పోసేందుకు నిచ్చెన ఎక్కగా ప్రమాదవశాత్తు జారి కిందపడడంతో తురు పాన్ చింద తలకు తీవ్ర గాయమైంది. బట్టీలోనే పనిచేస్తున్న అతడి బంధువులు మాల్ వెంకటేశ్వర్‌నగర్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. సోమవారం మృతుడి అన్న జట్టు చింద ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించినట్లు పేర్కొన్నారు.

కూరగాయల దుకాణంలో దొంగతనం

మోత్కూర్: కూరగాయల దుకాణంలో గుర్తుతెలియని వ్యక్తి చోరీకి పాల్పడ్డాడు. ఈ ఘటన సోమవారం రాత్రి మోత్కూర్ మున్సిపల్ కేంద్రంలో జరిగింది. స్థానిక అంబేద్కర్ చౌరస్తా వద్ద నార్కట్‌పల్లి రోడ్డులో మంజుల అనే మహిళ నిర్వహిస్తున్న కూరగాయల దుకాణం వద్దకు సోమవారం రాత్రి ముఖానికి మాస్క్ వేసుకున్న గుర్తుతెలియని వ్యక్తి బైక్‌పై వచ్చాడు. షాపు క్లోజ్ చేసే సమయంలో మంజుల డబ్బులున్న బ్యాగును కౌంటర్‌పై పెట్టగా.. బ్యాగుతో పాటు సెల్‌ఫోన్‌ను ఎత్తుకెళ్లాడు. బ్యాగులో రూ.45వేలు ఉన్నాయని బాధితురాలు తెలిపింది. ఇదిలా ఉండగా చెరువు కట్టపై పండ్లు అమ్ముకునే వట్టిపు ఉప్పలమ్మ అనే మహిళ దుకాణంలో కూడా దొంగతనం జరిగినట్లు ఆమె తెలిపింది. ఎస్ఐ నాగరాజు తన సిబ్బందితో కలిసి చోరీ జరిగిన ప్రాంతాలను పరిశీలించి విచారణ చేపట్టారు.

ప్రయోగాలతో ప్రత్యక్ష అనుభవం



సైన్స్ ల్యాబ్ ఆన్ వీల్స్ ప్రారంభిస్తున్న విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్ రాజీవ్, డీఈఓ

భువనగిరి : ప్రయోగాలు, శాస్త్ర సాంకేతిక పరికాల ద్వారా ప్రత్యక్ష అనుభవం కలుగుతుందని విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్ రాజీవ్ పేర్కొన్నారు. సోమవారం భువనగిరిలోని కస్తూర్బాగాంధీ విద్యాలయంలో సైన్స్ ల్యాబ్ ఆన్ వీల్స్ కార్యక్రమాన్ని డీఈఓ సత్యనారాయణతో కలిసి ఆయన ప్రారంభించారు. సైన్స్ ల్యాబ్ ఆన్ వీల్స్ కార్యక్రమం ద్వారా సంబంధిత అంశాన్ని నేరుగా చూసినట్లు ఉంటుందన్నారు. కార్యక్రమంలో విద్యాశాఖ రాష్ట్ర కో ఆర్డినేటర్ శిరీష, జీఈసీఓ రాధ, కేజీబీవీల ప్రత్యేక అధికారులు పాల్గొన్నారు.

అక్రమంగా ఇసుక తరలిస్తున్న టిప్పర్ పట్టివేత

కోదాడరూరల్: ఆంధ్రప్రదేశ్ నుంచి తెలంగాణలోకి అక్రమంగా ఇసుక తరలిస్తున్న టిప్పర్‌ను సోమవారం కోదాడ రూరల్ పోలీసులు పట్టుకున్నారు. ఎస్ఐ అనిల్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఏపీలోని ఎన్టీఆర్ కృష్ణా జిల్లా వత్సవాయి మండలం హిందుపల్లి నుంచి ఎలాంటి అనుమతి పత్రాలు లేకుండా టిప్పర్‌లో ఇసుక లోడ్ చేసుకుని సరిహద్దు గ్రామమైన కూచిపూడి నుంచి కోదాడ మండలంలోని ఎర్రవరం వైపు వెళ్తుండగా పోలీసులు పట్టుకున్నారు. డ్రైవర్ జానీతో పాటు టిప్పర్ యజమానిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

మట్టపల్లిలో వైభవంగా నిత్య కల్యాణం

మఠంపల్లి: మట్టపల్లి దేవాలయంలో శ్రీరాజ్యలక్ష్మి, చెంచులక్ష్మి సమేత లక్ష్మీనరసింహస్వామి నిత్య కల్యాణాన్ని సోమవారం అర్చకులు వైభవంగా జరిపించారు. ఈ సందర్భంగా ఆలయంలో సుప్రభాతసేవ, నిత్యహోమం, మూలవిరాట్‌కు పంచామృతాభిషేకం నిర్వహించారు. స్వామి, అమ్మవార్లను నూతన పట్టువస్త్రాలతో అందంగా అలంకరించి ఎదుర్కోళ్ల మహోత్సవ సంవాదం రక్తికట్టించారు. విష్వక్సేనారాధన, పుణ్యాహవచనం, రక్షాబంధనం, రుత్విగ్వరణం, మధుపర్క పూజ, మాంగళ్యధారణ, తలంబ్రాలతో కల్యాణ వేడుక నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మవార్లను గరుడ వాహనంపై ఆలయంలో ఊరేగించారు. అదేవిధంగా మట్టపల్లి క్షేత్రంలోని శివాలయంలో పార్వతీరామలింగేశ్వరస్వామికి ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు విజయ్‌కుమార్, మట్టపల్లిరావు, ఈఓ నవీన్ కుమార్, అర్చకులు అద్దేపల్లి లక్ష్మణాచార్యులు, పద్మనాభాచార్యులు, ఫణిభూషణ మంగాచార్యులు, లక్ష్మీనరసింహమూర్తి, ఆంజనేయాచార్యులు పాల్గొన్నారు.



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

క్యాంపస్ సమాచారం

పరిశోధనలే యూనివర్సిటీల ప్రగతికి కొలమానం

- మహాత్మాగాంధీ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ అల్తాఫ్ హుస్సేన్



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఎంజీయూ వైస్ చాన్స్‌లర్ అల్తాఫ్ హుస్సేన్ తదితరులు

నల్లగొండ టూటౌన్: పరిశోధనలే యూనివర్సిటీల ప్రగతికి కొలమానం అని మహాత్మాగాంధీ యూనివర్సిటీ(ఎంజీయూ) వైస్ చాన్స్‌లర్ ఖాజా అల్తాఫ్ హుస్సేన్ అన్నారు. అడ్వాన్సెస్ ఆఫ్ టు హెటిరిల్ అండ్ హెట్రీ అల్కీల్ క్వినాజోలిన్ మూలకం విశిష్టతలు, వినియోగంపై ఎంజీయూ రసాయన శాస్త్ర విభాగం అధ్యాపకురాలు మిట్టపల్లి వసంత రచించిన పుస్తకాన్ని సోమవారం ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. ఇలాంటి పుస్తకాలు విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు. యూనివర్సిటీల్లో మేలైన పరిశోధనలు, ప్రచురణలు జరగాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో యూనివర్సిటీ రిజిస్ట్రార్ అల్వాల రవి, ఓఎస్డీ కొప్పుల అంజిరెడ్డి, డాక్టర్ ప్రశాంతి, ప్రొఫెసర్లు రేఖ, సరిత తదితరులు పాల్గొన్నారు.

ఎంజీయూలో విద్యార్థుల ధర్నా



ఎంజీయూలో ధర్నా చేస్తున్న విద్యార్థులు

నల్లగొండ టూటౌన్: మహాత్మాగాంధీ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ తప్పుడు నిర్ణయాల కారణంగా విద్యార్థుల జీవితాలు ఆగమవుతున్నాయని, విద్యార్థులందరికీ న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ ఆర్ట్స్, సైన్స్, కామర్స్, బీటెక్ విద్యార్థులు సోమవారం వైస్ చాన్స్‌లర్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. వీసీని తొలగించాలని నినాదాలు చేశారు. విద్యార్థులకు అన్యాయం చేసే నిర్ణయాలను వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యార్థులందరినీ పరీక్షలకు అనుమతించాలని, మూడో సెమిస్టర్ పరీక్షలు నెలరోజులు వాయిదా వేయాలని కోరారు. వీసీ తగిన నిర్ణయం తీసుకోకుంటే పెద్దఎత్తున ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. మూడుగంటల పాటు ధర్నా చేయడంతో వీసీ వచ్చి వారితో చర్చలు జరిపి తగిన న్యాయం చేస్తామని హామీ ఇచ్చినట్లు విద్యార్థులు తెలిపారు.

రాబోయే కాలం కృత్రిమ మేధస్సుదే

రామగిరి(నల్లగొండ): రాబోయే కాలం కృత్రిమ మేధస్సుదేనని మహాత్మాగాంధీ యూనివర్సిటీ కంప్యూటర్ సైన్స్ విభాగం ప్రొఫెసర్ డాక్టర్ సీహెచ్ సుధారాణి అన్నారు. సోమవారం నల్లగొండ పట్టణం లోని ఎన్జీ కళాశాలలో ఆర్టిఫీషియల్ ఇంటలిజెన్స్ అండ్ మిషన్ లెర్నింగ్ అంశంపై సుధారాణి విస్తృతోపన్యాసం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె విద్యార్థులతో మాట్లాడుతూ.. ఒకప్పుడు విద్యుత్ మాదిరిగా రాబోయే కాలంలో కృత్రిమ మేధ కూడా ప్రజలని ప్రభావితం చేస్తుందని అన్నారు. అన్నిరంగాల్లో కృత్రిమ మేధ చొచ్చుకొని వచ్చి విప్లవాత్మక మార్పులు తెస్తుందని పేర్కొన్నారు. విద్యార్థులు ఈ కృత్రిమ మేధ మీద దృష్టి పెడితే ఎన్నో ఉపాధి అవకాశాలను చేజిక్కించుకోవచ్చని తెలిపారు. అనంతరం విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఉపేందర్, కంప్యూటర్ సైన్స్ విభాగం హెచ్ఓడీ వెంకటరమణ, అధ్యాపకులు వై.కిరణ్, వై.రుకేష్, కె.నాగరాజు, బి.గోపి, వై.సైదులు, యు.విజయ్, ఎస్. వెంకన్న, టి.సంధ్యారాణి, కె.రమ, విద్యార్థులు పాల్గొన్నారు.

యాదగిరిగుట్టలో మార్వాడీ దుకాణాలు తెరవొద్దు

- బాధితుల ఆందోళన

యాదగిరిగుట్ట: బంగారం కుదువపెట్టి అప్పులు తీసుకుని ఎగ్గొట్టిన జైభవాని జ్యూవెలరీ యజమాని జిత్తును పోలీసులు పట్టుకొని తమ డబ్బులు, బంగారం ఇచ్చేంత వరకు యాదగిరిగుట్ట పట్టణంలో మార్వాడీ దుకాణాలు తెరవొద్దని బాధితులు సోమవారం ఆందోళన చేపట్టారు. జై భవాని జ్యూవెలరీ దుకాణం ముందు టెంట్ వేసి నిరసన తెలిపారు. జిత్తును యాదగిరిగుట్ట పట్టణానికి తీసుకొచ్చి పరిచయం చేసిన దుర్గా జ్యూవెలరీ దుకాణం ఎదుట కూడా ఆందోళన చేపట్టారు. దుర్గా జ్యూవెలరీ దుకాణాన్ని దాని యజమాని తీస్తుండగా బాధితులంతా అడ్డుకున్నారు. పోలీసులు అక్కడికి చేరుకొని బాధితులను సముదాయించారు. అనంతరం బాధితులు మాట్లాడుతూ.. తమ డబ్బులు ఇచ్చేంత వరకు మార్వాడీ దుకాణాలు తీయొద్దని డిమాండ్ చేశారు. ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య ఇచ్చిన ఆదేశాలను పాటించాలన్నారు. పోలీసులు వెంటనే జై భవాని జ్యూవెలరీ యజమాని జిత్తును అరెస్ట్ చేసి తమ సొమ్మును ఇప్పించాలని, అప్పటి వరకు నిరాహార దీక్షలు చేస్తామని బాధితులు తెలిపారు.



దుర్గా జ్యూవెలరీ దుకాణం తెరవనీయకుండా ఆందోళన చేస్తున్న బాధితులు

ఒక్కరే టీచర్.. ఐదుగురు విద్యార్థులు

- శిథిలావస్థలో వెంబాయి ప్రాథమిక పాఠశాల
- అంగన్‌వాడీ కేంద్రం పక్కన ఒకే గదిలో విద్యాబోధన
- మధ్యాహ్న భోజనం వండిపెడుతుంది కూడా టీచరే..

చిట్యాల: ఆ పాఠశాలలో మొత్తం ఐదుగురు విద్యార్థులు, ఒకేఒక్క టీచర్ ఉన్నారు. పైగా కరెంట్ సౌకర్యం లేని గది కూడా ఒకటే ఉండడంతో అందులోనే విద్యార్థులకు టీచర్ పాఠాలు చెబుతోంది. ఈ పరిస్థితి చిట్యాల మండలం వెంబాయి గ్రామ పంచాయతీ గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో నెలకొంది. నమోదైన ఈ ఐదుగురు విద్యార్థుల్లోనూ రోజూ ఇద్దరు లేదా ముగ్గురే హాజరవుతున్నారు. గతంలో 35 మంది వరకు విద్యార్థులు ఉండగా ప్రస్తుత విద్యాసంవత్సరానికి ఐదుగురు విద్యార్థులే మిగలడంతో విద్యా శాఖ అధికారులు ఈ పాఠశాలకు ఒకే టీచర్‌ను కేటాయించారు. పాఠశాలకు వచ్చే విద్యార్థులకు విద్యాబోధన చేయడంతో పాటు తానే చిన్న కుక్కర్‌పై మధ్యాహ్న భోజనం కూడా వండి పెట్టాల్సి వస్తోందని ఇక్కడ విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయురాలు అరుణ పేర్కొన్నారు.



విద్యార్థులకు బోధన చేస్తున్న టీచర్ అరుణ



రంగులు వేసి తాళం వేసిన పాఠశాల

కూలిపోతున్న భవనానికి రంగులు వేసి..

వెంబాయిలోని ప్రాథమిక పాఠశాల భవనం శిథిలావస్థకు చేరి కూలిపోయే స్థితికి చేరుకుంది. దీంతో పాఠశాలలో అంగన్‌వాడీ కేంద్రం పక్కన ఉన్న మరో గదిలో ప్రస్తుతం విద్యార్థులకు విద్యాబోధన జరుగతోంది. కానీ, శిథిలావస్థకు చేరుకున్న భవనానికి మరమ్మతులు చేయకుండానే మనఊరు-మనబడి కార్యక్రమంలో రంగులు వేసి తాళం వేశారు. భవనం గోడకు మంచినీటి నల్లాలు ఏర్పాటు చేశారు. అయినా ప్రస్తుతం నిరుపయోగంగానే ఉంది. కూలిపోయే స్థితిలో ఉన్న పాఠశాలకు రంగులు వేసి ప్రజాధనం దుర్వినియోగం చేసిన వారిపై తగిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

బాలల హక్కులను పరిరక్షిద్దాం

- రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు అంజన్‌రావు



మర్రిగూడ హైస్కూల్‌లో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న అంజన్‌రావు

మర్రిగూడ: బాలల హక్కుల పరిరక్షణకు సమష్టిగా కృషిచేద్దామని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు పానుగోటి అంజన్‌రావు అన్నారు. సోమవారం మర్రిగూడ మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం, హైస్కూల్‌ను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రంలోని పాలు, గుడ్ల నాణ్యతను, హైస్కూల్‌లో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి మాట్లాడారు. టెన్త్ విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. బాలల హక్కులకు భంగం కలిగితే 1098 నంబర్‌ను సంప్రదించాలని కోరారు. అనంతరం ఆయన ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఆయన వెంట ఎంఈఓ బిట్టు శ్రీనివాస్, చింతపల్లి సీడీపీఓ సక్కుబాయి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ముమ్మడి యశోద, హైస్కూల్ హెచ్ఎం కళా శ్రీనివాస్, ఉపాధ్యాయుడు మాస బాలరాజు తదితరులు ఉన్నారు.

రావి సురేందర్‌రెడ్డికి కేశరావు జాదవ్ పురస్కారం



పురస్కారం అందజేస్తున్న ప్రతినిధులు

భువనగిరిటౌన్: తెలంగాణ ఉద్యమకారుడు రావి సురేందర్‌రెడ్డి ప్రొఫెసర్ కేశవరావు జాదవ్ స్మారక పురస్కారం అందుకున్నారు. ఆయనకు ఆదివారం రాత్రి హైదరాబాద్‌లోని నారాయణగూడలో గల భారతి డిగ్రీ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్సీ కోదండరాం, ప్రజా గాయని విమలక్క, జర్నలిస్ట్ పాశం యాదగిరి అవార్డు అందజేశారు.